క్లుప్తంగా

గోపుర నిర్మాణానికి రూ.1.80లక్షల విరాళం



రాజోళి: మండల కేంద్రంలోని భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న మహాగణపతి ఆలయ గోపుర నిర్మాణానికి రాజోళి మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.1.80లక్షల విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు కలశానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా, దాతలు కలశాన్ని తలపై పెట్టుకుని అర్చకుల వేద మంత్రాల నడుమ ఆలయంలోకి తీసుకొచ్చారు. ఆలయ నిర్మాణంలో, గ్రామ అభివృద్ధిలో తమ కుటుంబ సభ్యులు ముందుంటామన్నారు.

'గౌతు శిరీషపై ఆరోపణలు సరికాదు'

రాజోళి: గౌతు లచ్చన్న వారసురాలిగా ఆయన విగ్రహావిష్కరణకు వెళ్లిన గౌతు శిరీషపై టీడీపీ నాయకులు చేస్తున్న కామెంట్లు అర్థరహితమని రాజోళి, వడ్డేపల్లి గౌడ సంఘం ప్రధాన కార్యదర్శులు సిద్ధయ్య గౌడ్, పరమేష్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఏపీతో పాటు, ఉమ్మడి రాష్ట్రంలో గౌతు లచ్చన్న అంటే తెలియని వారు లేరని, సబ్బండ వర్గాల ప్రజల కోసం పోరాటం చేసిన మహానుభావుడని కొనియాడారు. అలాంటి ఆదర్శవంతుడి విగ్రహం నూజివీడులో ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఆయన వారసులిగా కార్యక్రమానికి వెళ్లిన శిరీషపై టీడీపీ నాయకులు విమర్శలు చేయడం తగదని అన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా వారసురాలిగా వెళ్లిన ఆమెకు కార్యక్రమంలో ఎవరు ఉన్నారనే సంగతి ఎలా తెలుస్తుందని, తాత విగ్రహావిష్కరణకు వెళ్లిన ఆమెపై అధికార పార్టీ కార్యకర్తలు ఆరోపణలు చేయడం సమంజసం కాదని హితువు పలికారు. సొంత పార్టీ కార్యకర్తలే సోషల్ మీడియా ద్వారా అర్థరహిత కామెంట్లు పెట్టడం చూస్తే, బీసీలకు టీడీపీలో ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతుందన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



కేటీదొడ్డి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతూ డలంలోని కొండాపురం గ్రామంలోని ఎంవీఎఫ్ ఆధ్వర్యంలోని బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, 18 ఏళ్లు నిండిన అమ్మాయి, 21 ఏళ్లు నిండిన అబ్బాయిలకు మాత్రమే పెళ్లిలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల పుట్టబోయే పిల్లలకు అనారోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో గాజుల కృష్ణ, సీఆర్పీ సభ్యులు తిమ్మారెడ్డి, రమేష్, వీరేష్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి



కేటీదొడ్డి: విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ముసల్‌దొడ్డి, పాగుంట పాఠశాలలను బుధవారం ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతం పరిశీలించి, వారితో పుస్తక పఠనం చేయించారు.

'భూ భారతి' వల్ల రైతులకు ప్రయోజనం

కొత్తకోట రూరల్: గత ప్రభుత్వం 2020లో తెచ్చిన ధరణి పోర్టల్‌ను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భూ భారతి 2024 కొత్త చట్టం అమలులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కొత్త ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకురావడంపై కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మనిషికి, భూమికి వీడదీయరాని అనుబంధమని, భూమి ఉంటే ఆత్మగౌరవంతో బతికే అవకాశం వస్తుందన్నారు. ధరణి చట్టం వల్ల మూడేళ్లలో రైతులకు లక్షలాది సమస్యలు తీసుకొచ్చారని మండిపడ్డారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



- రాములు నాయక్, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, గద్వాల



చలికాలంలో వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి. తెల్లవారుజామున మంచు కప్పేయడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగా కనపడవు. దీంతో ప్రయాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఇండికేషన్ ఇస్తూ లైట్లు ఆన్‌ఆఫ్ చేస్తూ ఉండాలి. నిద్ర సమయంలో వాహనాన్ని నిలిపి పార్కింగ్ లైట్లు వేసి విశ్రాంతి తీసుకోవాలి. అత్యవసర సరుకులు తరలించే గూడ్స్ వాహనాలకు ఇద్దరు డ్రైవర్లు ఉండేలా చూసుకోవాలి. మద్యం తాగి వాహనం నడపొద్దు. మిగితా రోజుల కంటే శీతాకాలంలో డ్రైవర్లు స్వీయ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. - గద్వాల క్రైం

చలికాలంలో జాగ్రత్తలు పాటించాలి..



- డా. సతీష్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్, జిల్లా ఆస్పత్రి, వనపర్తి



నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. చలికి తట్టుకోలేక చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ కాలంలో జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఉదయం, సాయంత్రం వేళలో ముక్కు, చెవులను కప్పి ఉంచేలా ఉన్ని దుస్తులు ధరించడంతో పాటు స్వెటర్ వేసుకోవాలి. సాధ్యమైనంత వరకు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి. అత్యవసరమైతే తగిన రక్షణ కవచాలను ధరించి ప్రయాణం చేయవచ్చు. ఉబ్బసం వ్యాధితో బాధపడే వారు ఆల్కహాల్, ధూమపానానికి దూరంగా ఉండటంతో పాటు ఆహార నియమాలు పాటించాలి. మధుమేహ వ్యాధిగ్రస్తులు చలితో నిమోనియా బారినపడే ప్రమాదం ఉన్నందున బయట తిరగకపోవడం మంచిది. గోరువెచ్చని నీటిని తాగడంతో జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. - అమరచింత

మిరప రైతు కుదేలు



మానవపాడులో తెగుళ్లు వ్యాప్తి చెందిన మిర్చి పంట



గోకులపాడులో వ్యాపించిన తెగుళ్లు

- పూత దశలో విజృంభిస్తున్న తెగులు
- మందులు పిచికారీ చేసినా ఫలితం శూన్యం
- దిగజారుతున్న ధరలతో భారీ నష్టం

మానవపాడు: ఆరుగాలం పడించిన మిరప పంట చేతికి వచ్చే వరకు రైతుకు అవస్థలు తప్పడం లేదు. తీవ్ర తుఫాన్ దాటికి ఎర్రకాయ రంగు మారి నష్టపోయిన రైతుకు.. చలికాలంలో ప్రబలిన నల్లి, తెల్లదోమ వంటి కీటకాలు పంటను నష్టపరిచాయి. నల్లి తెగులు కారణంగా పూత రాలిపోవడంతో పిందెలు రావడం లేదు. దీంతోపాటు ఆకులకు, కాయలకు బూడిద తెగులు వ్యాప్తితో పిందెలు రాలిపోతున్నాయి.

ఎకరాకు రూ.1.50లక్షల ఖర్చు

నారు పోసే నాటి నుంచి ఎరువులు, పురుగుల మందులు పిచికారీ, కలుపుతీత, పండు మిర్చి కోత, కల్లాల్లో ఆరబెటి అమ్మేవరకు ఎకరాకు దాదాపు రూ. 1.50లక్షలు అవుతుంది. కౌలు రైతులైతే ఎకరాకు రూ.20వేల నుంచి రూ.30వేల దాకా అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఇంత ఖర్చు చేసి పంటను సాగుచేసి రైతులకు తీరా పంట చేతికి వచ్చే సమయానికి తెగులు వ్యాప్తిచెంది రైతులకు తీవ్ర నష్టంగా పోతున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని 124 గ్రామాల్లో సుమారు 19,245 ఎకరాల్లో సాగుచేస్తున్నారు.

తగ్గిన దిగుబడి.. ధరలు

గతేడాదితో పోల్చుకుంటే మిర్చి దిగుబడులు తగ్గాయి. సాధారణ ఎకరాకు 30 క్వింటాళ్లు వస్తుండగా.. ఈ ఏడాది 10 నుంచి 15 క్వింటాళ్ల లోపే దిగుబడి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మిర్చి ధర క్వింటాల్‌కు రూ.17వేల నుంచి రూ.25వేల దాకా పలుకుతుంటే.. ఈ ఏడాదిలో రూ. 8వేల నుంచి 14వేల వరకు పలుకుతోందని రైతులు వాపోతున్నారు. దీంతో కనీసం కూలి, రవాణా ఖర్చులు కుడా రావడం లేదంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని, ధర పెంచడంతో పాటు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మిరప రైతులు కోరుతున్నారు.

24 ఎకరాల్లో సాగు



దాదాపు 24 ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. సుమారు రూ.36లక్షలు వరకు పెట్టుబడి పెట్టా. పూత దశలో తెగుళ్లు, నల్లి, బొబ్బర తెగులు, వైరస్ వ్యాప్తి చెంది ఆకులు ముడుచుకుపోతున్నాయి. దీంతో పూత, పిందె రాలిపోతున్నాయాయి. దిగుబడి తగ్గడంతో పాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయా.

- బోయ గణేష్, చెన్నిపాడు, మానవపాడు మండలం

మార్కెట్‌లో అమ్మేలా..



అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్‌లో మిర్చిని కొనుగోలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మిర్చి ధర తగ్గడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, రాయిచూర్, తెలంగాణ ప్రాంతాల రైతులకు అలంపూర్ మార్కెట్‌యార్డ్ అందుబాటులో ఉండడంతో వ్యాపారులు అధికంగా వస్తారు. ప్రభుత్వం మిర్చి ధరలు పెరిగేలా చర్యలు తీసుకొని, రైతులను ఆదుకోవాలి.

- వెంకటేష్, రైతు, చెన్నిపాడు

నల్లి తెగులుతో..



8 ఎకరాల్లో మిర్చి మిర్చి పంట సాగు చేశాను. నల్లి, తెల్లదోమ కారణంగా పంట దిగుబడి తగ్గిపోతుంది. రూ.12 లక్షల వరకు ఖర్చయింది. పెరిగిన కూలీలు ఖర్చులు, ఎరువులు, మందులు పిచికారీ, కౌలు రేట్లతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మిర్చి ధర తక్కువగా ఉండటంతో దిక్కుతోచని స్థితిలో రైతు విలవిలలాడుతున్నాడు.

- బజారన్న, రైతు, మానవపాడు

చదువుకుంటేనే బంగారు భవిష్యత్



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న ఎల్‌టీఐమైండ్‌ట్రీ, భవిష్యత్‌భారత్ సంస్థ ప్రతినిధులు, అధికారులు

గట్టు: విద్యార్థులు చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని, తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు కోరారు. ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సంస్థ సహకారంతో భవిష్య భారత్ సంస్థ ఆధ్వర్యంలో యల్లందొడ్డి గ్రామంలో కమ్యూనిటీ సర్వీస్ కం రీసోర్స్ సెంటర్‌ను బుధవారం జిల్లా పశువైద్య అధికారి వెంకటేశ్వర్లు, డీడబ్ల్యూఓ సుధారాణి, జిల్లా ఉపాధి కల్పన అధికారిణి, గట్టు మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక ప్రారంభించారు. ఈ సందర్భంగా 8 మంది పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను, మిగితా విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేశారు. అనంతరం వైద్య శిబిరంతో పాటుగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ సుధారాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐదేళ్ల లోపు చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యను ఆట, పాటల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నయ్య, మాజీ సర్పంచ్ రాధిక, ఎల్‌టీఐమైండ్‌ట్రీ సంస్థ పనీష్, లలిత, భవిష్యభారత్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ట్రస్టీ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) హరిప్రసాద్, సంస్థ డైరెక్టర్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వం చేయిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: బీజేపీ నాయకులు మండల కేంద్రంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీలకు నిధులు అందిస్తుందని, నేషనల్ హైవే రోడ్లు నిర్మిస్తుందన్నారు. పేదలకు నిరంతరం ఉచిత బియ్యం అందజేస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, పట్టణ అధ్యక్షుడు నరసింహయ్యశెట్టి, కో కన్వీనర్ భగత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



అలంపూర్ బాలికల పాఠశాలలో..

ఎర్రవల్లి: విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని తహసీల్దార్ నరేందర్ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గది, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందినప్పుడే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను వినియోగించుకొని ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ భీమ్‌సేన్‌రావు, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

కేజీబీవీ సందర్శన

ధరూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను తహసీల్దార్ వెంకట్రావు, ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. బుధవారం మధ్యాహ్నం భోజన సమయంలో పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదివి ప్రయోజకులు కావాలని, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు 10 జీపీఏ సాధించాలని సూచించారు. వంట గదిని పరిశీలించారు.

అలంపూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను ఎంఈఓ అశోక్‌కుమార్ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ధరూరులో..



ఇటిక్యాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నరేందర్

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



బిజ్వారంలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నందికర్

మల్దకల్: సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ నందికర్ సూచించారు. బుధవారం మండలంలోని బిజ్వారంలో కళాబృందం సభ్యులతో కలిసి ఎస్‌ఐ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని వివరించాలన్నారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయడంతో పాటు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు రాధమ్మ, కృష్ణ, రామాంజనేయులు, శిరీష, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత అందించాలి



అయిజ: విద్యార్థులు చదువుకునేందుకు దాతలు చేయూత అందించాలని ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి అన్నారు. బుధవారం మండలంలోని రాజాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న అంజి, సంధ్య దంపతుల కుమారుడు అభిరాం పుట్టిన రోజు సందర్భంగా పులికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 34 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ప్యాడ్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజని, జహీర్, యాకోబ్, గోపి, మధు, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



రంజిత్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారిని బుధవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ చైర్మన్, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతలను రంజిత్ కుమార్‌కు చైర్మన్ ప్రహ్లాదరావు వివరించి శేషవస్త్రంతో సత్కరించి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, విష్ణు, కిష్టన్న, లవన్న, లక్ష్మన్న, భీసన్న, గోపాల్, దొడ్డెన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొంకల విద్యార్థులు



శాంతినగర్: సీఎం కప్ పోటీల్లో పాల్గొన్న కొంకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అన్వర్ హక్ తెలిపారు. వాలీబాల్ పోటీల్లో టి.ఉదయ్, ఖోఖోలో కె.గాయత్రి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జీహెచ్‌ఎం వివరించారు. ఇద్దరు విద్యార్థులను బుధవారం పాఠశాల ఆవరణలో అభినందించారు.

'కేటీఆర్‌పై కుట్రలు సరికాదు'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గద్వాల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం నింపేందుకు నిత్యం ప్రయత్నిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి సర్కార్ కక్ష పెంచుకుందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. కేటీఆర్ మీద అక్రమ కేసులు బనాయిస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలబెట్టడం కోసం అంతర్జాతీయంగా జరిగిన ఫార్ములా ఈవెంట్‌ను మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌కు తీసుకుచ్చారని తెలిపారు. ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఆటో ప్రమోటర్, తెలంగాణ ప్రభుత్వానికి ఈ సంస్థ మధ్య నాలుగేళ్ల ఒప్పందం జరిగిందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అములు చేయడంలో విఫలం కావడంతో.. ప్రజలను మభ్యపెట్టేందుకు కేటీఆర్‌పై కుట్రలకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మల్దకల్ నాయుడు, మంద మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేకం చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయశర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నిక పత్రం అందజేస్తున్న పరిశీలకులు

గద్వాల: ఆర్యవైశ్య మహాసభ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం గద్వాలలో రాజావీధి వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా మిడిదొడ్డి శ్యాంసుందర్, ఎన్నికల అధికారిగా భీమా ప్రభాకర్ హాజరుకాగా అధ్యక్షునిగా ఇద్దరు మెడిశెట్ట బాలస్వామి, జయరామయ్య నామినేషన్ వేయగా మేడిశెట్టి బాలస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధానకార్యదర్శి నరహరి, శ్రీనివాసులు, ప్రస్తుత గౌరవ అధ్యక్షుడు నందిమల్ల సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, రామ్మోహన్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



ఎర్రవల్లి: క్రిస్మస్ పండగను పురస్కరించుకొని మండలంలోని వేములలో బుధవారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారులు పోటీల్లో ఉత్తమ ప్రదర్శనను ఇచ్చి జాతీయ స్థాయి వరకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సూరి, పెద్ద గోవింద్, కాంతారెడ్డి, చిన్న గోవింద్, రమేష్, ప్రవీణ్, దేవరాజ్, రాముడు, వెంకటేష్, కిరణ్, నాగేష్, తదితరులు ఉన్నారు.